www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు



శనగ పంట.. కన్నీరు కంట



ఐరాల మండలంలో ఎండిపోయిన పంటను చూపుతున్న రైతు యుగంధర్‌రెడ్డి

ఏటా ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో రైతు కంట కన్నీరే మిగులుతోంది. దుక్కిదున్ని విత్తనం వేసి పచ్చగా పెరుగుతున్న వెరుశనగ పంటను చూసి మురుసిపోయే రైతు.. వర్షాభావ పరిస్థితుల వల్ల కళ్లెదుటే పంట ఎండిపోతున్న పరిస్థితి. ఏటా ఇదే పరిస్థితి నెలకొంది. పరిహారం అందిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు నోటి మాటలకే పరిమితం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చనిపంట ఎండితుంటే కన్నార్పకుండా వరుణుడి రాక కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వేరుశనగ పంట ఎండి రైతుల కంట కన్నీరు మిగులుస్తోంది.


- ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

- చినుకు రాలక.. నేల తడవక
- ఎండుతున్న వేరుశనగ పంటలు
- సీఎం సొంత జిల్లాలో రైతుల ఘోష
- ఆదుకోవాలని అన్నదాత వేడుకోలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాధారణ ఖరీఫ్ సాగు 1,49,963హెకార్లు ఇందులో చిత్తూరు జిల్లాలో 35,156, తిరుపతి జిల్లా 14,602, అన్నమయ్య జిల్లా 10,287.2హెకార్లు ఈ ఏడాది వేరుశన సాగు చేస్తున్నారు. ఆగస్టు మొదటి వారంలో ఓ మోస్తారు వర్షలు కురవడంతో రైతులు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపారు. విత్తనాలు మొలకెత్తాయి. సెప్టంబర్ మొదటి వారం నుండీ వర్షపు చుక్క నేల రాలకపోవడంతో జిల్లా వ్యాప్తంగా పంట పూర్తిగా ఎండిపోయింది. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో వేరుశనగ పంటను కాపాడేందుకు వ్యవసాయశాఖ ద్వారా సమీపంలోని నీటి ద్వారా స్పింక్లర్స్, డిప్ పరికరాల ద్వారా వేరుశనకు ఊపిరిపోశారు. ఈ ఏడాది ఆ ప్రయత్నం కూడా చేయకపోవడంతో నిలువున ఎండిన పంట అన్నదాత కంట కన్నీరు తెప్పిస్తోంది. వ్యవసాయ శాఖ సబ్సిడీ పేరుతో 30కేజీల వేరుశన విత్తన కాయలు దాదాపు రూ.2వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఎకరం వేరుశనగ సాగుకోసం ఇంచుమించు రూ.10 నుంచి రూ.12వేలు ఖర్చు చేశారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం అందాలంటే ఈ-పంట నమోదు తప్పని సరి అయితే జిల్లాలో ఈ ఏడాది 45వేల మంది రైతులు ఈ-పంట నమోదు చేసుకున్నట్లు సమాచారం. నమోదైన పంటలకు నష్టపరిహారం ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందో స్పష్టత లేదు. ఈ-పంట నమోదు చేసుకోని రైతుల దుస్థితి ఆగమ్యగోచరం.

సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులను ప్రోత్సహించేలా వ్యవసాయశాఖ ద్వారా 80శాతం సబ్సిడీతో 14.150 క్వింటాళ్ళు ఉలవలు జిల్లాకు వచ్చినా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండటం లేదని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లాలో ఉలవ సాగుకు రైతులు ముందుకు రావడం లేదంటూ జిల్లాకే కేటాయించిన ఉలవ విత్తనాలు వ్యవసాయశాఖ తిరిగి పంపిన్నట్లు సమాచారం. వర్షభావ పరిస్థితులతో నిలువునా మునిగిన ఖరీఫ్ రైతులను ఆదుకోవాలని జిల్లాలోని వేరుశనగ రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పైసా వచ్చే పరిస్థితి లేదు..



ఎండిన పంట చూపుతున్న రైతు మల్లయ్య

పూతలపట్టు మండలం చీరసాగరం గ్రామానికి చెందిన రైతు మల్లయ్య రూ.10వేలకు పైగా ఖర్చు చేసి ఎకరం సాగు చేశారు. ఊడలు దిగే సమయానికి వర్షం ఉసూరుమనిపించింది. పంట పూర్తిగా ఎండిపోయింది. పైసా కూడా వచ్చే పరిస్థితి లేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా సాయం అందించాలని కోరుతున్నారు.

పంట మాడిపోయింది..



హరిప్రసాద్, రైతు

పుంగనూరు మండలం వనమలదిన్నె గ్రామంకి చెందిన రైతు హరిప్రసాద్ రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. దాదాపు రూ.60వేలకు పైగా ఖర్చు చేశారు. వర్షం లేక పంట మాడిపోయింది. పూర్తి పంట చేతికందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా సాయం చేయాలని కోరుతున్నారు.

ఆత్మహత్యే శరణ్యం..

ఐరాల మండలం 35యల్లంపల్లికి చెందిన రైతు యుగంధర్ రెడ్డి సాగు కోసం ఇబ్బందులు పడి అప్పులు చేసి వేరుశనగ పంట వేశారు. వర్షాలు కురవక పూర్తి పంట ఎండిపోయింది. ప్రభుత్వం తరపున పెట్టుబడికి సాయం అందించక.. ఇటు నష్టానికి పరిహారం అందించకుంటే కడుపేదరికంలో నష్టాన్ని ఎలా భరించాలని కన్నీరుపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం అంటున్నారు. ప్రభుత్వ పరంగా సాయం అందించాలని మొరపెట్టుకుంటున్నారు.

కన్నీరే మిగిలింది..



ఎండిన పంటను చూపుతున్న రైతు యేసురత్నం

ఎస్ఆర్ పురం మండలంలోని 49కొత్తపల్లి చెందిన యేసురత్నం ఎకరానికి రూ.12 నుంచి రూ.15వేలు చొప్పున ఖర్చు చేసి రెండు ఎకరాల్లో వేరుశనగ వేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోయింది. కన్నీరే తప్ప పంట ఆశించే పరిస్థితి లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని, పరిహారాన్ని అందించాలని కోరుకుంటున్నారు.

అప్పు చేసి పంట సాగు..



ట్యాంకర్ నీటితో పంట తడుపుతున్న రైతులు

గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రంకి చెందిన కౌలు రైతు గోపాల్ మొదలి ఎకరం భూమిని కౌలుకు తీసుకొని రూ.11వేల ఖర్చుతో పంట వేశారు. చినుకు జాడ కానరాకపోవడంతో సకాలంలో పంటలకు నీరందక పూర్తిగా ఎండిపోయింది. సాగు కోసం వడ్డీకి అప్పు తెచ్చుకొని పంట వేస్తే వర్షాలు లేక ఎండిపోతుండడంతో ఆ రైతు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. సర్కార్ ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

వక్ఫ్ బోర్డ్ బిల్లును వ్యతిరేకిస్తాం

- పుంగనూరు మాకు తల్లి లాంటిది
- అభివృద్ధి చేస్తే సన్మానిస్తాం
- కంపెనీలకు సౌకర్యాలు కల్పించండి
- ఎంపీ మిథున్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గం ఎప్పుడు తమకు తల్లి లాంటిది అని నియోజకవర్గాలు పునర్విభజన జరిగితే ఇక్కడి నుంచి తనే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటూ రాజంపేట ఎంపి పి.వి మిథున్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాదర్ ఖాన్ వృద్ధాప్యరీత్య మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించడానికి సోమవారం పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పునర్విభజన జరిగితే పుంగనూరును మాత్రం ఎటువంటి పరిస్థితులలోనూ వదులుకోమని తను పుంగనూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, ఏ ఒక్క మండలాన్ని వదులుకోమని ప్రజలకు కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకిస్తామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీల అభిప్రాయాలను సేకరించి ఎంపీ విజయసాయిరెడ్డి సారధ్యంలో కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లులు పూర్తిస్థాయిలో వ్యతిరేకించి ఆమోదం పొందకుండా ఉండేందుకు తమ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఉంటాయన్నారు. పుంగనూరు అభివృద్ధికి ఎప్పటికీ కట్టుబడి ఉంటామన్నారు. టెస్లా కంపెనీ పుంగనూరు మండలంలో ఏర్పాటు చేయడానికి వారు సిద్ధంగా ఉన్నారని, పంపిణీ స్థాపించడానికి కంపెనీ వారికి కావలసిన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాజకీయాలకతీతంగా సహకరించి కంపెనీలు ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య ఉండదన్నారు. వాటర్ గ్రిడ్ పనులు 50శాతం వరకు పూర్తి చేయడం జరిగింది, మిగిలిన పనులు పూర్తి చేయడానికి కావలసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తే అన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తామన్నారు. పైపులు ఫ్యాక్టరీ త్వరలో పూర్తి అవుతుందన్నారు. గత ప్రభుత్వం జరిగిన అభివృద్ధి కన్నా ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తే ఇదే మున్సిపల్ కార్యాలయంలో వారిని సన్మానించడం జరుగుతుందన్నారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ అవసరమని చెప్పారు. వాటిని కూడా మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పార్లమెంటు సమావేశాలు అనంతరం పుంగనూరు మండలం, మున్సిపల్ కేంద్రంలో వార్డు బాట కార్యక్రమాలు పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మాజీ ముడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, కొండవీటి నాగభూషణం, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు మున్సిపల్ కార్యాలయం వద్ద

ఉత్కంఠ భరితంగా ఎంపీ పర్యటన

ఎంపి మిథున్ రెడ్డి పుంగనూరు పర్యటన సందర్భంగా కొంత ఉత్కంఠత నెలకొన్నది. సోమవారం ఉదయం నుండే పుంగనూరు పట్టణంలో పోలీసు బలగాలు భారీగా మోహరించి. పట్టణానికి నలుమూలల పోలీసులు పహారా కాస్తు వాహనాలను పుంగనూరులోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎవరికి అనుమతులు లేవంటూ పోలీసులు ఎంపీ కార్యక్రమానికి వచ్చిన నాయకులను కూడా అడ్డుకున్నారు. కార్యాలయంలో వెళ్లడానికి కౌన్సిలర్లు ఐడెంటి కార్డు చూపాలని, స్థానికంగా ఉన్న నాయకులు ఆధార్ కార్డు చూపించాలని బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు ఎవరిని లోనికి అనుమతించమని పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. పోలీసుల పరిహార చూసి ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఉత్కంఠతతో ఎదురు చూడడం పట్టణ ప్రజల వంతైంది. అయితే ఎంపీ పర్యటన మాత్రం ప్రశాంతంగా ముగిసింది. పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఏటా సెప్టెంబర్ నెలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా అల్బెండోజోల్ మాత్రలు 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయసు పిల్లలు, యువకులకు వైద్య ఆరోగ్యశాఖ అందించనుంది. జిల్లాలోని 2,420 అంగన్వాడీ కేంద్రాల్లోని 7,89,24 మంది చిన్నారులు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు 2,883లోని 2,366,91మంది విద్యార్థులు, ఇంటర్మీడియల్‌లోని 4,37,87మంది విద్యార్థులు, బడి బయటి 4,486మంది పిల్లలకు ఆల్బోండోజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మండల విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ సీడిపివోలు పర్యవేక్షించనున్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 1-19 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారికి ఆల్బోండోజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసిన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌ఛార్జ్ డిఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు.

వైభవంగా వసంతోత్సవం



చక్రస్థానంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పదవ రోజున సోమవారం ఉదయం యాగశాలలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి వారి ఉత్సవ మూర్తుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణాహుతి, వసంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వసంతోత్సవం సందర్భంగా ఒకరికొకరు రంగులు పూసుకొని స్వామి వారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. తరువాత ఆలయ పుష్కరిణిలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో గురు ప్రసాద్, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు ఎంపికైన అశ్విన్



నీట్‌లో ర్యాంక్ సాధించిన అశ్విన్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణం వడ్డేపల్లిలో పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇంద్రన్, ఆశల కుమారుడు అశ్విన్ వైద్య విద్య ప్రవేశ పరీక్షలో 529మార్కులు సాధించి పిఈఎస్ వైద్య కళాశాలలో ఉచిత ప్రవేశాన్ని సాధించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అశ్విన్‌ను మట్టిలో పుట్టిన మాణిక్యం, పేదింట వెలిసిన విద్యా కుసుమం అని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. భవిష్యత్తును ఆలోచించి వర్తమానంలో పని చేసే సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంను విద్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పరచాలని గతంలోనే ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే పలు కళాశాలను ప్రారంభించడంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి పలు రకాల పథకాలను ప్రవేశపెట్టారు. అలాంటి పాడి పరిశ్రమలు నమ్ముకుని జీవిస్తున్న రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి స్థానికంగా ఉన్న పీఈఎస్ వైద్య కళాశాలలో ప్రవేశం పొందడంపై స్థానిక ప్రజలతో పాటు పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట వినలేదని.. కుటుంబానికి గ్రామ బహిష్కరణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శంకరప్ప కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: గ్రామపెద్దల మాట వినలేదని కక్షతో ఓ కుటుంబాన్ని సామాజిక గ్రామబహిష్కరణ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలం పెద్దచెల్లారగుంట పంచాయతీ కుమ్మరిగుంట గ్రామంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన బాధితులు గంగరాజు, మణి, శంకర్పలకు కుమ్మరిగుంట గ్రామం సమీపంలో సర్వే నెంబర్ 247 /678లో 4.60 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. అందులో గ్రామస్తుల అభిప్రాయం మేరకు కామిదొడ్డి గంగమ్మ దేవాలయానికి 3.9 సెంట్లు ఇచ్చారు. అయితే గ్రామపెద్దలు, గుడి పెద్దలు కలిసి వ్యవసాయ భూమి 4.8సెంట్లను కూడా గుడి స్థలంలో కలుపుకున్నారు. దీంతో బాధితులు ఇదేమి అన్యాయమని అడిగా స్పందించకపోవడంతో గ్రామపెద్దలపై న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. గ్రామపెద్దల తీర్పును వ్యతిరేకిస్తారా అంటూ మూడు కుటుంబాలపై కక్షసాధింపు చర్యలు పూనుకున్నారు. దీంతో సోమవారం బాధితులు విలేకర్ల సమావేశంలో వారి గోడుపు వెల్లబుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రామపెద్దలు తమ స్థలాన్ని అన్యాయంగా ఆక్రమించుకోవడాన్ని అడ్డుకున్నామని తమపై హత్యానేరంతోపాటు అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని వాపోయారు. అయినా భరించి గ్రామంలో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కాగా ఈనెల వినాయక చవితి పండుగ తరువాత 14వ తేదీ నిమర్జనం అనంతరం తమ కుటుంబాన్ని గ్రామబహిష్కరణ చేసినట్లు గ్రామపెద్దలు కె. వెంకట రమణ, కె.గోవిందు, ఎం.వెంకటప్ప, కృష్ణప్ప, ఎం. వెంకటరమణతోపాటు పెద్ద చెల్లారగుంట గోపాల్‌ని పిలిపించి గ్రామంలో దండోరా వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులతో ఎవరూ మాట్లాడకూడదని, దుకాణాల్లో సరుకులు ఇవ్వకూడదని, డిపోలో పాలు పోయకూడదని, పొలాల్లో పశువులు మేయకూడదని దండోరాలో తెలిపారన్నారు. అలా కాకుండా గ్రామపెద్దల నిర్ణయాన్ని ధిక్కరిస్తే రూ.50వేలు జరిమానా విధిస్తామని చాటింపు వేశారని కన్నీటిపర్యంతమయ్యారు. తమకు జరిగిన అన్యాయాన్ని పోలీస్ స్టేషన్లో చెప్పుకోవడానికి కూడా భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి బహిష్కరించిన వారిపై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు.

ప్రకృతి వ్యవసాయం అమలులో మహిళల పాత్ర అద్భుతం



మెక్సికో ప్రతినిధుల ప్రశంస

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ 'ఏపీసీఎన్ఎఫ్' (ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో మహిళా సంఘాల పాత్ర అద్భుతమని తిరుపతి జిల్లాలో పర్యటిస్తున్న మెక్సికో దేశప్రతినిధి బృందం ప్రశంసించింది. సోమవారం మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ నేతృత్వంలో మెక్సికో బృంద సభ్యులు తిరుపతిలోని ఓ హోటల్‌లో రైతు సాధికార సంస్థ అధికారులతో తమ మొదటిరోజు క్షేత్ర సందర్శనపై తమ అభిప్రాయాలను తెలిపారు. మహిళలు వ్యవసాయంలో, ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ అమలులో చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మహిళల సంఘటిత శక్తి ఏపీసీఎన్ఎఫ్ కార్యక్రమాన్ని ముందుకు తెసుకెళ్లడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. మెక్సికో దేశంలో మాదిరి కాకుండా ఇక్కడి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు మద్దతు నివ్వడం బాగా ఆకట్టుకొందని అన్నారు. ప్రభుత్వం సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజాసమూహాలను శిక్షణలతో బలోపేతం చేస్తూ వినూత్న కార్యక్రమాలను అమలు చేయడం శుభ పరిణామం అన్నారు. అనంతరం వైవి.పాలెం మండలంలోని ఉదయ్ మాణిక్యం గ్రామంలో గ్రామ ఐక్య సంఘ ప్రతినిధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయ అమలులో తమ పాత్రను వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గడమే గాకుండా ఆరోగ్యపరంగా అనేక లాభాలు కలుగుతున్నట్లు మహిళలు మెక్సికో బృందం రసాయనరైతులు ప్రకృతి వ్యవసాయంలోకి రావడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని మహిళా సంఘ ప్రతినిధులను ప్రశ్నించారు. రసాయన రైతుల్లో మార్పుకు దోహదం చేసే అంశాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం బృందసభ్యులు అదే గ్రామంలో సుధాకర్ అనే ప్రకృతి వ్యవసాయ రైతు మామిడి తోటలో వేసిన పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) ఏటీఎం (డ్రాట్ ప్రూఫింగ్ మోడళ్లను సందర్శించారు. ఆ తర్వాత అదే గ్రామంలో రసాయన పద్ధతిలో పండిస్తున్న వి.సుబ్రమణ్యం మామిడి తోటను కూడా సందర్శించి ఫలితాలను అడిగి తెలుసుకొన్నారు. సాయంత్రం చిన్నగొట్టిగల్లు మండలంలోని చట్టేవారి పాలెం గ్రామంలో జి. సుబ్రమణ్యం అనే రైతు వ్యవసాయ క్షేత్రం సందర్శించి ప్రకృతి వ్యవసాయ విధానంలో నిర్వహిస్తున్న ఏటీఎం, డ్రాట్ ప్రూఫింగ్ మోడళ్లను సందర్శించారు. అనంతరం ఇదే గ్రామంలో సరస్వతి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో అయిదు అంతస్తుల నమూనాను, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు కెసి.చంద్రశేఖర్, కె.సురేష్ బాబు, స్మిత, డాక్టర్ రాజగోపాల్, సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, ప్రాంతీయ సాంకేతిక అధికారి రవిచంద్ర ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అదనపు మేనేజర్ పట్టాభి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ పడేశావేంటన్నందుకు దాడి

- ఆందోళన చెందుతున్న బాధిత కుటుంబం
- దళితులమైన తమను కులం పేరిట దూషించి దాడి చేశారని ఆరోపణ
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- రక్షణ కల్పించాలని వేడుకోలు




ప్రజాశక్తి-గంగవరం: దళిత భార్యాభర్తలపై అగ్రకులానికి చెందిన వారు దాడి చేసిన సంఘటన గంగవరం మండలం సాయి బాలాజీ వీధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు గురురాజా, ఇతని భార్య రత్నమ్మ తెలిపిన వివరాల మేరకు.. తాము కూలీ నాలి చేసుకుని సాయి బాలాజీ వీధి సమీపంలో ఉన్న సుబ్బరాయప్పకుంట వద్ద నివాసముంటున్నామని తెలిపారు. అదే ప్రాంతంలో అగ్ర కులానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు పోలీస్ కుటుంబం నివసిస్తున్నారని తెలిపారు. ఆ కుటుంబం వారు ప్రభుత్వ భూములో కారు పార్కింగ్ చేసుకోవడానికి ఒక రేకుల షెడ్డు నిర్మించారని, వారి కారు పక్కలోనే తమకు సంబంధించిన స్కూటర్ను చాలా రోజుల నుంచి అక్కడే పార్కింగ్ చేసేవారమని పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీ తాము స్కూటర్ పెట్టిన విషయాన్ని గమనించిన పోలీస్ సుబ్రమణ్యం నాయుడు కుమారుడు నవీన్ తమ స్కూటర్ను షెడ్డులో నుంచి పక్కకి ఈడ్చి పడేశాడు దాన్ని గమనించిన తన భర్త గురు రాజా "ఏం నవీన్ మా స్కూటర్ని పక్కకు పడేసింది" ఎందుకని అడుగుతుండగానే విచక్షణారహితంగా దాడి చేసి కొట్టి, చొక్కా, చింపి, కులం పేరుతో దూషిస్తుండగా గొడవ తెలుసుకొని అడగడానికి వెళ్లిన తనను కూడా సుబ్రమణ్యం నాయుడు భార్య సులోచన, కుమార్తె భాను కలిసి కిందపడేసి కొట్టారని బాధితురాలు రత్నమ్మ ఆరోపించారు. అంతటితో ఆగకుండా నవీన్ తనకు బెంగళూరులో రౌడీలు ఉన్నారని వారిని పిలిపించి మీ అంతు చూస్తామని, మా నాన్న పోలీస్, తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తామని, ఇక్కడ ఎలా బ్రతుకుతారో మీ అంతు చూస్తానని సవాల్ చేయడంతో భయంగా ఉందని కంటతడి పెట్టారు. జరిగిన దాడిపై అదే రోజు గంగవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని ఇంతవరకు విచారణ కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి నుండి తమకు ప్రాణ నష్టం కలిగే ప్రమాదం ఉందని రక్షణ కల్పించాలని కోరారు.

పుణ్యక్షేత్రమా.. డంపింగ్ కేంద్రమా...!!

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ఈ చిత్రం చూశారా..!! ఇదేదో డంపింగ్ యార్డనకుంటే పప్పులో కాలేసినట్లే. పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తిలో ఓ వీధి దుస్థితి ఇది. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన మురుగునీటి కాలువల్లో పూడిక తీత పనులు చేయించారు. అయితే పాత హెడ్ పోస్టాఫీసు వీధిని మాత్రం మున్సిపల్ అధికారులు విస్మరించారు. కనీసం అక్కడ డస్ట్ బిన్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు, వ్యాపారస్తులు వ్యర్థాలను వీధిలోనే పడేస్తున్నారు. ఫలితంగా పాత హెడ్ పోస్టాఫీసు వీధి డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఆ వ్యర్థాల నడుమ పందులు, వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో తద్వారా వచ్చే దుర్గంధాన్ని భరించలేక ప్రజలు ముక్కులు మూసుకొని పోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారుల్లో చలనం రావాల్సిన అవసరం ఉంది.

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి: ఎమ్మెల్సీ

- ఘనంగా విజయం డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సంబరాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం ప్రతి విద్యార్థి ప్రథమ కర్తవ్యం అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం చిత్తూరులో విజయం డిగ్రీ కళాశాల 21వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్య కేవలం ఉద్యోగాన్ని సాధించేలా మాత్రమే కాకుండా సమాజ హితానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. విశిష్ట అతిధి రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ళ రాఘవేంద్ర మాట్లాడుతూ చదువు ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను మెరుగు పరచుకొని తమ తల్లి తండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆధునిక పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను, వనరులను అందించడంలో 'విజయం' ఎల్లప్పుడు ప్రథమ స్థానంలో ఉంటుందని తెలిపారు. 25 సంవత్సరాలుగా మమ్మల్ని అన్ని విభాగాలలో ప్రోత్సహిస్తున్న తల్లి తండ్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్య సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శైలజ మూర్తి కళాశాల వార్షిక నివేదికను నివేదించారు. అకాడమిక్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి, క్రీడల విభాగంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చివరిగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

'పీఎం మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలి'



మత్స్యశాఖ స్టాల్‌ను ప్రారంభిస్తున్న చెన్నకేశవనాయుడు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని గురజాల చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవ నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక జానకారపల్లిలో పీఎం మత్స్య సంపద యోజన పథకం కింద మంజూరై ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. స్టాల్ నిర్వాహకులు శైలేష్, సతీష్ మాట్లాడుతూ చిత్తూరు నగరవాసులకు తక్కువ ధరతో మంచి పౌష్టికాహారాన్ని అందించేలా స్టాల్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తక్కువ లాభంతో నాణ్యమైన చేపలను వండి కస్టమర్లకు అందిస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి గురజాల చెన్నకేశవులు నాయుడును స్టాల్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఎస్ఐ వెంకట సుబ్బయ్యను పలువురు టీడీపీ నాయకులు సోమవారం మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ మురళి, గంగయ్య, భాస్కర్‌రెడ్డి, సతీష్, లోకేష్ రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన 'విఎం నిధి'


ఎంపితో మాట్లాడుతున్న విఎం నిధి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావును జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సోదరుడు నిధి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు ఎంపి కార్యాలయంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ పరమైన విషయాలను ఎంపికి వివరించారు. నిధి వెంట నాయకులు వెంకటేష్, నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో రికార్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అనారోగ్యంతో రికార్డ్ అసిస్టెంట్ వి.మురళి మృతి చెందారు. బంగారుపాళ్యం పట్టణానికి చెందిన ఈయన బైరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తుండగా ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సోమవారం విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు మురళి మృతదేహానికి నివాళులర్పించారు.


మురళి(ఫైల్)

అపోలోలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: భారతదేశ ఇంజనీరింగ్ దిగ్గజం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సెప్టెంబర్ 15వ తేదీని ఇంజనీర్స్ డేగా జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా చిత్తూరు అపోలో యూనివర్సిటీలో 16వ తేదీన రిజిస్ట్రార్ పోతురాజు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ మొదటి సంవత్సరం విద్యార్థులు అధ్యాపకులు సమక్షంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాలు సమర్పించి కార్యక్రమం ప్రారంభించారు. స్వతహాగా ఇంజనీర్ అయిన రిజిస్ట్రార్ పోతురాజు తన ప్రసంగంలో సమాజంలో నూతన ఆవిష్కరణలలో ఇంజనీర్ల పాత్ర ప్రాముఖ్యతలను వివరించి ప్రతి విద్యార్థి విశ్వేశ్వరయ్య గారిని స్ఫూర్తిగా తీసుకొని గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలని సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని అందుకు కావలసిన సహకారాన్ని, సాంకేతికతను యూనివర్సిటీ సమకూరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సునీల్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు, అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో అవరణలో ఎస్‌డబ్ల్యుఎఫ్ 46 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున ఆ సంఘం జెండాను సోమవా రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆర్‌టిసి కార్మికుల సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఫెడరేషన్ ఎన్నో ఏళ్లుగా కార్మికుల పక్షాన నిలపడి పోరాటాలు చేస్తోందన్నారు. అనంతరం ఫెడరేషన్ విశిష్టతను, ఐక్య పోరాటాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూ రు డిపో సీనియర్ నాయకులు, శేషయ్య , కమిటీ నాయకులు రఘురామయ్య, రమణయ్య , గురవయ్య , సుబ్రహ్మణ్యం , కృష్ణ , వెంకటేశ్వర్లు , సుబ్రహ్మణ్యం, కిరణ్, సురేంద్ర, వాసు, రాము, శ్రీధర్, గూడూరు పట్టణ సిఐటియు నాయకులు శ్రీనివాసులు, ఎస్ సురేష్ , బివి రమణయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం బాలాజీ నగర్ లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో సోమవా రం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థి చదు వుకు పది వేల రూపాయలు అందిం చారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ వాకాడు మండలానికి చెందిన విద్యార్థి పనబాక శ్రీనాథ్ విద్యానగర్ లోని ఎన్‌బి కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారన్నారు. ఇంట్లో పరిస్థితిలు సరిగా లేక ఇంటి వద్దే ఉంటున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రగతి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి విద్యార్థికి సాయం అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, ఐటిఐ ప్రభాకర్, పోతిరెడ్డి పెంచలయ్య, పి శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, విజయ్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా మహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రవక్త ముహమ్మద్ నబీ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముహమ్మద్ ప్రవక్త జయంతిని ఈద్-ఎ-మిలాద్ ముస్లింలకు చాలా ప్రాముఖ్యతను కలిగి, అల్లా యొక్క చివరి దూతగా ముస్లింలు పరిగణిస్తారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి ముబారక్ తాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముహమ్మద్ ప్రవక్త జీవితం, వారసత్వాన్ని గౌరవించే రోజు ఖురాన్లో పొందు పరచబడిన అతని బోధనలు, వ్యక్తిగత ప్రవర్తన నుండి సామాజిక నిబంధనల వరకు ప్రతిదానిని ప్రభావితం చేస్తూ, ముస్లింల రోజువారీ జీవితాలకు మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి అని అన్నారు. ముస్లింలు ప్రవక్త యొక్క కరుణ, వినయం, వివేకం వంటి సద్గుణాలను స్మరించుకుంటారు. శాంతి, సమానత్వం మరియు న్యాయం యొక్క సందేశాన్ని వ్యాప్తి చేయడానికి అతని ప్రయత్నాలు ఆచరించేందుకు, చాలా మంది విశ్వాసులు ఇస్లామిక్ సూత్రాల ప్రకారం జీవించడానికి తమ నిబద్ధతను పునరుద్ధరించడానికి ఈ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అజీజ్ అహమ్మద్,మండల మైనారిటీ నాయకులు అజీమ్ తాజ్, నజీమ్ తాజ్, మండల కన్వీనర్ నవాజ్ షరీఫ్, ముత్తవల్లి బావజన్, భావాజాన్, రెడ్డి గౌస్, రెడ్డిబాషా, ఖాదర్ బాషా, నజీర్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ సాధు శాంతికి పుత్రవియోగం

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ సాధు శాంతి రెండవ కుమారుడు చిన్నా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య గత కొంత కాలంగా దూరంగా ఉండడంతో వ్యసనాలకు బానిసై అనారోగ్యం పాలయ్యాడు. తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండడంతో తిరుపతిలోని రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ప్రాణాలు విడిచాడు. మృతి విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయుడుపేట రాజగోపాలపురం లోని కౌన్సిలర్ సాధు శాంతి నివాసానికి చేరుకుని చిన్నా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కౌన్సిలర్ సాధు శాంతి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వెంట వైసిపి మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాలేటి నాగార్జున, షేక్ షబ్బీర్, వైసిపి నాయకులు పేర్నాటి రాహుల్ ఉన్నారు.


చిన్నా భౌతికకాయం వద్దనివాళులర్పిస్తున్న నాయకులు

అందరికీ రుణపడి ఉంటా


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే


ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పేద ప్రజల కోసం అహర్నిశలు సేవలు అందించిన తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణ నాయుడు అడుగు జాడల్లో నడుస్తున్న తనను అఖండ మెజారిటీతో గెలిపించిన నగరి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. కార్వేటి నగరం రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో ఆ సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. తనకు తనతండ్రి ఆశీస్సులతో పాటు, తండ్రి లాంటి విశ్రాంత ఉద్యోగుల ఆశీస్సులు లభించడం తన అదృష్టమని, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి వ్యక్తిగతమైన, సంఘపరమైన సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నగరి ఎమ్మెల్యేకి విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు, చెన్నై ప్రముఖ పారిశ్రామికవేత్త శోభారాజు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త శోభా రాజు పుత్తూరులోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణానికి రూ.6 లక్షలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో భవనంలో ఏర్పాటు చేసిన శోభా రాజు అమ్మమ్మ, తాతయ్య, తల్లి దండ్రుల, వారి దంపతుల ఫోటోలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, పుత్తూరు గౌరవాధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు యుగంధర్ రాజు విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకి మెమోరాండం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పుత్తూరు శాఖ అధ్యక్షులు భాస్కర్ రాజు మాట్లాడుతూ 2007 సంవత్సరంలో కీర్తిశేషులు అప్పటి నగరి ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు పుత్తూరు కార్వేటి నగరం రోడ్డు లో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనం నిర్మాణానికి భూమి పూజ చేయగా నేడు భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆ కార్యక్రమంలో వారి కుమారుడు ప్రస్తుత ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొనడం అభినందనీయమని, విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పుత్తూరు శాఖ కార్యదర్శి కుప్పయ్య, సభ్యులు రామచంద్ర రాజు, మురళి, బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీలు గంజి మాధవయ్య, ఏలుమలై అమ్ములు, చిత్తూరు జిల్లా పార్లమెంటరీ టిఎన్‌టియుసి అధ్యక్షులు ఆర్ మాధవ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, కరుణ యాదవ్ గాలి గోపీనాథ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విఎం పల్లి అభివృద్ధికి కృషి: బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని విఎంపల్లి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ పేర్కొ న్నారు. పట్టణంలోని వీఎంపల్లి గంగమ్మ ఆలయంలో బొజ్జల బృందమ్మ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భం గా బృందమ్మ మాట్లాడుతూ విఎం పల్లితో బొజ్జల కుటుంబానికి విడదీయరాని బంధం ఉందన్నారు. విఎంపల్లి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.


అన్నదానం చేస్తున్న బొజ్జల బృందమ్మ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్


దగ్ధమైన ట్రాక్టరును చూపుతున్న బాధిత రైతు

- ట్రాక్టర్ దగ్ధం - రైతు ఆశలు ఆవిరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లో ఏర్పడ్డ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెలరేగిన మంటలు వ్యాపించి ఓ ట్రాక్టర్‌ను దగ్ధం చేశాయి. దాన్ని నమ్ముకుని అభివృద్ధి సాధిస్తామనుకున్న ఓ రైతు ఆశలను ఆవిరి చేశాయి. ఈ సంఘటన తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం చోటు చేసుకుంది. చియ్యవరం గ్రామానికి చెందిన వయ్యావుల మాధవయ్యకు మూడు ఎకరాల పొలం వుంది. ఆ పొలంలో ఆధునిక వ్యవసా యం చేసేందుకు రెండేళ్ల క్రితం ఏపీ ఇఎం 2298 నెంబరు గల ట్రాక్టర్ ను వాయిదా పద్ధతిలో కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఆదివారం పొలాన్ని దున్ని మధ్యాహ్నం భోజన సమయం కావడంతో ట్రాక్టర్ ను పక్కనే ఖాళీగా ఉన్న బహిర్భూమిలో ఆపి ఇంటికి వెళ్లాడు. భోజనం అనంతరం తిరిగి పొలానికి వెళ్లగా మంటల్లో పూర్తిగా దగ్ధమవుతున్న ట్రాక్టర్‌ను చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఇరుగుపొరుగు రైతులను సాయం కోరినా, వారొచ్చి మంటలను ఆర్పే లోపే ట్రాక్టరు పూర్తిగా కాలి పోయిం ది. బహిర్భూ మిలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు ఎండి న తాటి మట్టలు, ముళ్ల పొదలపై పడి క్షణాల్లో చుట్టు ముట్టాయి. ఈ మంటల్లో ట్రాక్టర్‌తో పాటు సుమారు 60కు పైగా తాటి చెట్లు మంటల్లో కాలి బూడిద య్యాయి. బాధిత రైతు మాధవయ్య తనకు ప్రభుత్వం నుంచి సాయం కావాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి జన్మదిన సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి -కోట : బిజెపి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్య కుమార్ జన్మదిన సందర్భంగా సత్యన్న సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నెల్లూరులోని వేదయపాలెం సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు పెళ్లూరు సుమన్ ప్రజాపతి మాట్లాడుతూ మంత్రి జన్మదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాలలో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్, సత్యకుమార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు పెళ్లూరు సుమన్ ప్రజాపతి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరమ్మ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గిరి కుమార్ గౌడ్, నాయకులు చిన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రఘురామయ్య, సురేష్ రెడ్డి, శ్రీనివాసులు, సోఫా ప్రసాద్, దొర, మధు శిల్పి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సౌందర్య రాజా,సభ్యులు అంకయ్య, ధనుంజయ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి -కోట : సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సరస్వతీ కటాక్షం పేరుతో దాతల దాతృత్వంతో ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాలలోని 10 మంది విద్యార్థులకు 30 వేల రూపా యలను కోట మండల కేంద్రం లోని శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, షిరిడీ సాయి అక్షయ సేవా సమితి చైర్మన్ అల్లం.రమణయ్య దాతల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా విచ్చేసిన వక్తలు మాట్లాడుతూ ఆర్థిక వెనుకపాటుతో ఇబ్బందులు పడుతున్న పది కుటుంబాలలోని విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున అందించడం గొప్ప అని ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దీవి.అనంతబాబు మాట్లాడుతూ విద్య వల్ల మంచి జ్ఞానాన్ని పొంది తద్వారా సమాజానికి ఉపయోగపడాలని చిన్నారులకు హితువు పలికారు.దాతల సహకారంతో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయగలుగుతున్నామని మున్ముందు కూడా దాతల సౌజన్యంతో మరెన్నో కార్యక్రమాలు చేయడానికి తమ సంస్థ ప్రతినిధులు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్ శర్మ,శేషాద్రి శర్మ, చంద్రమౌళీశ్వర శర్మ,నందు,శివకుమార్ శర్మ, సంస్థ ప్రతినిధులు నరేష్ శర్మ, సాయిబాబు, యుగంధర్, రూపేష్ కుమార్ శర్మ, దీవి మురళీకృష్ణ, శ్రీనివాస్, పవన్ శర్మ, శివ పాల్గొన్నారు.


పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న ధార్మిక సంస్థ

సమతుల ఆహారంతో వ్యాధి నిరోధక శక్తి పెంపు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: సమతుల ఆహారంతో వ్యాధి నిరోధక శక్తి పెంపు అవుతుందని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ లత అన్నారు. శిశు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా సోమవారం రామచంద్రాపురం మండలం సి రామాపురం పంచాయతీ లోకమాతాపురంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలతో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చిత్రీకరించిన పౌష్టికాహార పదార్థాల చక్రం అందర్నీ ఆకట్టుకుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు కిశోర బాలికలకు ప్రతిరోజు పాలు, పండ్లు, కోడిగుడ్లు, తాజా కూరగాయలు, ఆకుకూరలు వంటి సమతుల ఆహారం ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహార వివరాలను తెలిపారు. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి పిల్లలలో ఎదుగుదల ఏర్పడుతుందని తెలిపారు. అంగన్‌వాడి పర్యవేక్షకురాలు పావనిశ్రీ మాట్లాడుతూ ఆడపిల్లలు చిన్నప్పటి నుంచి మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే పెద్దయిన తరువాత మాతా శిశు మరణాల రేటు తగ్గు తుందని చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకించి పలు రకాల పౌష్టిక ఆహార పదార్థాలను వివిధ రూపాలలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకట మునెమ్మ , రుక్మిణీదేవి, రూప, వరలక్ష్మి, వాణిశ్రీ , దేశమ్మ, పలువురు చిన్న పిల్లల తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.


సమతుల ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : టిడిపి


రైతులకు ఉచిత మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: రామచంద్రాపురం: పాడి రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. సోమవారం పశు గణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండలంలోని పివిపురంలో ఏర్పాటు చేసిన గర్భ కోసం వ్యాధుల చికిత్స శిబిరం, రైతు అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశు వుల పై మన మండలం అధికంగా ఆధారపడి ఉన్నారని చెప్పారు. పశువులకు వచ్చే వ్యాధులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వైద్యశాల సలహాలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం గర్భ కోస పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 90 శాతం పేదలకు పుట్టడంపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలోనే ఏడాదికి ఒక దూడ పుట్టాలంటే ఎలాంటి పోషణ తీసుకోవాలి? విష యాన్ని పాడి రైతులకు వివరించారు. అనంతరం సుమారు వంద పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాడి రైతులకు మందులతో పాటు మినరల్ మిక్సర్‌ని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి, టిడిపి నాయకులు రాజేష్, మల్లిరెడ్డి, ప్రాంతీయ పశు వైద్యశాల చంద్రగిరి అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైద్యాధికారులు జయ కిషోర్, హేమ కుమార్, పశు వైద్య బృందం, మల్ రెడ్డి, రాజేష్ రెడ్డి, త్యాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వారం రోజులుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్న పివి కండ్రిగ ప్రజల మంచినీటి సమస్యను గుర్తించి మరమ్మతుల పనులు చేపట్టి పరిష్కరించామని సర్పంచ్ యనమల కోటమ్మ, ప్రసాద్ పాల్ తెలిపారు. సత్యవేడు నియోజవర్గ వైసిపి సోషల్ మీడియా కో కన్వీనర్ యనమల ప్రసాద్ పాల్ సోమవారం మాట్లాడుతూ వారం రోజుల క్రితం పివి కండ్రిగ గ్రామానికి తాగునీటి సరఫరా అందించే మోటరు కాలిపోయి మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. సమస్యను గుర్తించిన యనమల కోటమ్మ సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. యనమల ప్రసాద్ పాల్ సహకారంతో కాలి పోయిన మోటారును నూతనంగా వైండింగ్ కట్టించి మోటారు ఏర్పాటు చేసి మంచినీటి సమ స్యను పునరు ద్ధరించా రు. ప్రతి గ్రామ పంచా యతీలో ప్రధా నమైంది తాగునీరు సరఫరా అందించడం, తర్వాత పారిశుధ్య పనులు, ఇతర పనులు యుద్ధ ప్రాతిపదికన మంచి నీటి సమస్యను పరిష్క రించామని ఆయన తెలిపారు.

మంత్రి రోజాకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏపీ రాష్ట్ర వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి ఆర్‌కె రోజాకు నగరి నియోజకవర్గం వైసీపీ నేతలు సోమవారం అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి ఈ పదవిని స్వీకరించి నగరికి విచ్చేసిన సందర్భంగా మాజీ మంత్రి నివాసంలో ఆమెకు ఘనంగా పూలమాల వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో అంకిత భావంతో పనిచేస్తూ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ గత 14 సంవత్సరాలుగా నగరి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ రాష్ట్ర మంత్రిగా ఎనలేని సేవలు చేసిన ఆర్కే రోజాకి పార్టీలో సముచిత స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేసి ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు , పుత్తూరు మున్సిపాలిటీ ఛైర్మన్ ఎ హరి, మోహన్ రెడ్డి , నారాయణ రెడ్డి, మునెయ్య, సత్య, ఉదయ్ కుమార్, రాజేష్, కృష్ణ ముదిరాజు, చిన్న, రమేష్, చిరంజీవి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.


రోజాను అభినందిస్తున్న వైసిపి నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి కలిసి చదు వుకున్న విద్యార్థులు 32 సంవత్సరాల తరు వాత సోమవా రం ఒకచోట కలుసు కున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉపాధ్యాయులు నాగయ్య , రామలింగం, నాగయ్య , గురవయ్య , మునిరాజు , సాయినాథ్ రావు , ప్రస్తుత పిచ్చాటూరు జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి ప్రకాష్‌ను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. జీవన స్థితిగతులు ఒకరికి కొకరు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ఉదయ్ కుమార్ , చంద్ర, మాధవి, చంద్ర మోహన్, సతీష్ , రామచంద్ర, పిఆర్ మురళి, చంద్రకుమార్, ప్యాండియన్, సురేష్ , విమురళి, సురేష్, వాసు, వెంకటేష్ , ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీని మండల ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సాటివారి పట్ల ప్రేమ, దయ, సౌభ్రాతృత్వ భావనలతో ఉన్నప్పుడే ప్రవక్త కోరుకున్న శాంతియుత సమాజం నెలకొంటుందని ముస్లిం సోదరులు పేర్కొన్నారు. క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే మిలాద్ ఉన్ నబీ పర్వదినమని పెద్దలు కొనియాడారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని సెంటర్ బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి పలమనేరు నుంచి మధురైకి వెళుతున్న సిమెంట్ లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ప్రమాదం రాత్రి జరగడంతో పెను ప్రమాదం తప్పి నట్లు స్థానికులు తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయపురం: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయపురం మండలం చిన్నమహావీరపురంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. చిన్న మహావీరపురం గ్రామానికి చెందిన నాగరాజు (41)కు కొద్ది నెలలుగా కడుపునొప్పి వస్తోంది. ఎన్ని ఆసుపత్రులలో చూపించినా నొప్పి తగ్గలేదు. ఆదివారం రాత్రి నొప్పి తీవ్రమవడంతో ఇంట్లో ఉన్న పురుగుమందు తాగేశాడు. నిద్రలో నుంచి మేలుకున్న తల్లి కుమారుడు మందు తాగిపడి ఉన్నాడని గ్రహించి, వెంటనే నగరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమ్మ శారద ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-సదుం: మండల కేంద్రానికి దగ్గర్లోని బట్టువారిపల్లి గ్రామ పరిసర ప్రాంతంలోని బావిలో గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఎస్ఐ షేక్ షా వలి ఆ మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు 55 నుంచి 60ఏళ్ల లోపు వయస్సు ఉండొచ్చునని నిర్ధారణకు వచ్చారు. వీఆర్‌ఓ షేక్ మహబూబ్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని ఆయన చెప్పారు. మృతదేహం ఫోటో ఆధారంగా గుర్తించి వారు వెంటనే 9440900701కు ఫోన్ చేయాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి చెక్‌పోస్ట్ వద్ద రహస్యంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం సాయంత్రం పోలీసుల అరెస్ట్ చేశారు. సోమవారం సీఐ తెలిపిన వివరాల మేరకు.. అందిన సమాచారంతో పలమనేరు-కుప్పం రహదారిలోని ఏఎంసి చెక్‌పోస్ట్ వద్ద చిరంజీవి అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అతని వద్ద నుంచి ఒక కేజీ, వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో నుండి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం(చంద్రగిరి): ఆటో నుండి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చంద్రగిరి మండ లంలో సోమవారం చోటు చేసుకుంది. చంద్రగిరి మండ లం మల్లయ్యపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి (45) ఆటో నుంచి జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతిలో ఓ ప్రైవేట్ లాడ్జిలో పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి సోమవారం విధులు ముగించుకుని తిరుపతి నుండి మల్లయ్య పల్లెకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఆటో చంద్రగిరి హీరా కాలేజీని సమీపిస్తుండగా ఆటోలో వెనుక కూర్చొన్న చంద్రశేఖర్‌రెడ్డి కాలుజారి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 సాయం తో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

బస్టాండులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ పరిధిలోని పోటు పాలెం కూడలి వద్ద వున్న బస్ స్టాండ్‌లో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘ టన సోమ వారం చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన ముక్తియార్ (60) మతి స్థిమితం లేకుండా తిరుగుతుంటాడరన్నారు. ఈ క్రమంలో అనారోగ్యంతో మృతి చెందాడని తెలిపారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

29న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణంలోని గాంధీ రోడ్డు మార్గంలో సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు ప్రాంగణంలో ఈ నెల 29వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షులు మురళి(కోళ్ల చిన్న) పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెన్నై శంకర్ నేత్రాలయ వైద్య బృందం కంటి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ శిబిరంలో కంటి ఆపరేషన్‌లకు ఎంపికైన వారికి చెన్నై శంకర్ నేత్రాలయ హాస్పిటలుకి తీసుకెళ్లి కంటి లెన్స్ అమర్చుతారని పేర్కొన్నారు. ఇందుకు ఆపరేషన్ చేయించుకునే వారికి ఉచిత భోజనంతో పాటు పాటు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో మండల ముదిరాజ్ సేవా సంఘం సౌజన్యంతో నిర్వహించనున్న వైద్య శిబిరానికి వచ్చే రోగులు వారితో పాటు ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకురావాలన్నారు. చికిత్సకు వచ్చే రోగులకు తోడుగా సహాయకుల్ని తీసుకురావాలని సూచించారు. 40 సంవత్సరాలు పూర్తయిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.